క్లుప్తంగా

అందుబాటులో అంబులెన్స్



సూచనలిస్తున్న ఏడీ నారాయణరావు

కొత్తూరు: ఎండలు తీవ్రంగా ఉన్నందున పశువులు వడ దెబ్బకు గురైతే సకాలంలో పశువైద్యశాలకు తీసుకువచ్చేందుకు అందుబాటులో అంబులెన్స్ ఉంటుందని స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ నారాయణరావు తెలిపారు. స్థానిక పశువైద్యశాలను గురువారం పరిశీలించి పాడి రైతులతో మాట్లాడారు. అంబులెన్స్ కోసం 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున పశువులను ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఆరుబయటకు మేత కోసం విడిచిపెట్టకూడదన్నారు. పశువులకు ఎక్కువగా నీరు తాగించాలి, ఎండలో పని చేయించరాదన్నారు. వడ దెబ్బకు గురైన పశువులకు శరీరమంతా చల్లని నీటితో కడగాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



పాతపాడులో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సరుబుజ్జిలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చినకాగితాపల్లి హెచ్ఎం తవిటినాయుడు తెలిపారు. పాతపాడు, లొద్దలకాగితాపల్లి గ్రామాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విద్య ఆవశ్యకత గురించి ప్రచారం చేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, దుస్తులు, బ్యాగులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రచారంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సరుబుజ్జిలి: బాల్యవివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు ఉంటాయని బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి గీత తెలిపారు. మండలంలోని రొట్టవలస సెక్టార్ పరిధిలో గురువారం బాల్యవివాహాలు, రుతు సంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సులు, ర్యాలీలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ సరైన పౌష్టికాహారాన్ని తీసుకుంటే బాలికలు, మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటారని సూపర్‌వైజర్ రత్నాంజలి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సారవకోట: మండలంలోని బురుజువాడ గ్రామానికి చెందిన గొర్లె మోక్షశ్రీ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు గురువారం ఆర్థిక సహాయం అందించారు. ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి తెలుసుకుని తమవంతుగా రూ.13 వేలను తండ్రి గొర్లె లక్ష్మీనారాయణకు అందించారు. ఫౌండేషన్ సభ్యులు తీడ ప్రసాద్, కుమార్ రాజా, కుమారి, షణ్ముఖరావు ఉన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న వైద్యుడు వేణుగోపాల్

పాతపట్నం: విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతోపాటు ఆటల్లో పోటీతత్వం అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యుడు జి.వేణుగోపాల్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులు, చిన్నారులు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ వేసవిలో ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు టోపీ, గొడుగు వాడాలని, తాగునీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. విశ్రాంత ఎంపీడీఓ ఎస్.చిరంజీవి, న్యాయవాది ఎం.రామారావు, గ్రంథాలయాధికారి కె.రాజు, రిసోర్స్‌పెర్సన్స్ పి.ఆనందరావు, బి.బెనర్జి, పాఠకులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

- ఉదయం 8 గంటలకే 30 డిగ్రీల ఉష్ణోగ్రత..
- మధ్యాహ్నం 12 గంటలకు 41 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత్తలు నమోదు
- ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలు



సరుబుజ్జిలి: నిర్మానుష్యంగా మారిన రొట్టవలస ప్రధాన రహదారి

సరుబుజ్జిలి/హిరమండలం: గత ఐదు రోజుల నుండి పగట ఉష్ణోగ్రత్తలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఉదయం 8 గంటలకే 30 డిగ్రీలు, మధ్యాహ్న 12 గంటలకు 41 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత్తలు నమోదవుతున్నాయి. ప్రతిరోజూ అత్యధికత ఉష్ణోగ్రత్తలు నమోదు కావడం వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చంటిపిల్లలు ఉక్కపోతతో అవస్థలుపడుతున్నారు. ఉదయం 8 గంటలలోపు పనులు ముగించుకుని ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ప్రధాన రహదారులు, వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కేరళ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో మరికొద్ది రోజుల్లో మనకు వాతావరణం చల్లబడే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. వేడి ఉపసమనం కోసం ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వాడకం ఎక్కువ అయింది. జిల్లాలో సధారణంగా సుమారు 8 మిలియన్ల యూనిట్లు వినియోగం ఉండగా.. ప్రస్తుతం 9.50 మినియన్ల యూనిట్లుకు పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. మరికొన్ని రోజులు ఎండలు తీవ్రత ఇదే మాదిరిగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తుండటంతో విద్యుత్ వాడకం మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

పెరుగుతున్న వేడిగాలుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ తీవ్రత పెరగకముందే బయట పనులు చూసుకుని ఇళ్లకు చేరుకోవాలి. తిరిగి సాయంత్రం మాత్రమే బయటకురావాలి. బయటకు రావల్సి వస్తే ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి.



హిరమండలం: ఉదయం 11గంటల సమయంలో నిర్మానుష్యంగా ఉన్న ఏబీ ప్రధాన రహదారి

ఉపాధి లక్ష్యాలు చేరుకోవాలి

- జిల్లా రోల్ మోడల్‌గా నిలవాలి
- డ్వామా పీడీ చిట్టిరాజు



మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

జలుమూరు: ఉపాధి వేతనదారులకు రోజువారీ వేతనం సరాసరి రూ.300 గిట్టుబాటు అయ్యేలా పనులు చేపట్టాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. జలుమూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జలుమూరు, సారవకోట మండలాల ఉపాధి ఏపీఓ, ఈసీ, సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. అన్ని మండలాల్లోనూ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు సిబ్బంది తగిన చొరవ చూపాలన్నారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పనులు చేయాలన్నారు. పనులు చేసేచోట చలువ పందిర్లు ఏర్పాటు చేయించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేయడం వల్ల గరిష్ఠ వేతనం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు నూరు శాతం ఉపాధి కల్పించాలన్నారు. రికార్డుల నిర్వహణ, కొత్త పనులకు సంబంధించి తక్షణమే అంచనాలు తయారు చేయాలన్నారు. రైతులకు మునగ సాగుపై అగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనుల్లో శ్రీకాకుళం జిల్లా రాష్ట్రానికి రోల్ మోడల్ కావాలని, దీనికి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీలు మురళీకృష్ణ, మెండ జయరామ్, ఏపీఓలు కె.శేఖర్, నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నంలో కార్డన్ సెర్చ్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐలు మహమ్మద్ యాసిన్, రాజేష్

పాతపట్నం: జూన్ 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ప్రతిఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు సహకరించాలని పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మహమ్మద్ యాసిన్, రాజేష్ అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని శివశంకర్ కాలనీ 1, 2, 3, 4 వీధుల్లో గురువారం కార్డన్ సెర్చ్‌లో భాంగా ఇంటింటా సోదాలు నిర్వహించారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాన్నారు. అందరూ కలిసిమెలిసి ఉండాలని, గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ద్విచక్రవాహనాలను పరిశీలించి, పత్రాలులేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఏఎస్ఐ సింహాచలం, పోలీసులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

సరుబుజ్జిలి: మరికొద్ది రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కానున్నాయి. అధ్యాపకులు, విద్యార్థులు బస్సుల్లో అధికంగా ప్రయాణాలు చేస్తారు. బస్సులు పూర్తి స్థాయిలో లేకపోవడంవల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. శ్రీకాకుళం నుంచి కొత్తూరు వరకు రెండు వైపులా గతంలో ఉన్న ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తగ్గించారు. దీనివల్ల ఆర్డినరీ బస్సులపైనే ప్రయాణీకులు ఆధారపడుతున్నారు. గంటల తరబడి బస్సుల కోసం వేచిచూసి, కొంతమంది ప్రయాణీకులు విసుగెత్తి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయణీకులు

వివాదాల జోలికి వెళ్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ప్రసాద్

నరసన్నపేట: పోలీసు రికార్డుల్లో ఉన్నావారు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా, మరే ఇతర వివాదాల్లో గానీ ఉన్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను ఉద్దేశించి నరసన్నపేట సీఐ బూర ప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలో ఉన్న 12 మంది రౌడీషీటర్లుకు గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద కౌన్సెలింగ్ నిర్వహించారు. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. ప్రధానంగా కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి వివాదాలు లేకుండా సహకరించాలన్నారు. నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస: జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, నాలుగో స్థానాలు కై వశం చేసుకుని సత్తా చాటారు. మణికొండ అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం ఓ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని తమ్మినేని సృజన ప్రథమ బహుమతి రూ.25,000, తొమ్మిదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ నాలుగో స్థానం సాధించి రూ.12,000 నగదు బహుమతి పొందారు. వీరికి పాఠశాల హెచ్ఎం బి.రామకృష్ణ, ఉపాధ్యాయులు గోపీకృష్ణ తదితరులు అభినందించారు.

హనుమాన్ జయంతికి సిద్ధం



సారవకోట:పందిరి రాట వేసి అంకురార్పణ చేస్తున్న భక్తులు

సారవకోట: జూన్ 1న హనుమాన్ జయంతి పురస్కరించుకుని మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో ఏర్పాట్లు చేస్తున్నారు. హనుమాన్ జయంతి నాడు స్వామివారి కల్యాణం చేపట్టనున్నందున పురుహితులు సుబ్రహ్మణ్య శాస్త్రి గురువారం పందిరి రాట వేసి అంకుర్పాణ చేపట్టారు. హనుమాన్ జయంతి నాడు మందిరంలో ప్రత్యేక, విశేష పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు అర్చకులు సోమేశ్వరరావు తెలిపారు.

అంజనేయస్వామి జయంతి..

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలోని కోరాడ స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి జయంతిని జూన్ 1 తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు జ్యోష్యుల సితారామశర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం, సాయంత్రం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని అర్చకులు కోరారు.

రెడ్డిపేటలో..

ఆమదాలవలస రూరల్: మండలంలో ప్రసిద్ధి చెందిన సంగమేశ్వర ఆలయం సమీపంలో ఉన్న కామిరెడ్డిపేటలో గల ప్రసన్న అభయాంజనేయస్వామి జయంతి ఉత్సవాలను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కామిరెడ్డి నర్సింగరావు తెలిపారు. మొదటిరోజు శుక్రవారం స్వామివారికి తమలార్చన, కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు. రెండో రోజు శనివారం నవమి సందర్భంగా రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, హనుమాన్ జయంతి పూజలు ఉంటాయాన్నరు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.



ఆమదాలవలస రూరల్: హనుమాన్ విగ్రహం



హిరమండలం: అభయాంజనేయ స్వామి విగ్రహం

24 మంది గైర్హాజరు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. అందులో భాగంగా గురువారం ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 150 మంది హాజరుకావాల్సిండగా 24 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ పి.ఈ.ఎస్.పట్నాయక్ తెలిపారు. కెమిస్ట్రీ పరీక్షకు 113 మంది విద్యార్థులకు 90 మంది, కామర్స్ పరిక్షకు 37 మందికి 36 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

జూద శిబిరంపై దాడి

- రూ.15,300 స్వాధీనం

నరసన్నపేట: స్థానిక లక్ష్మీ లాడ్జీ సమీపంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై నరసన్నపేట పోలీసులు గురువారం రాత్రి దాడి చేసి ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వారి వద్ద రూ.15,300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. లాడ్జి వెనుక బాగాన జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. పట్టణంలో ఎక్కడ జూదం ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా



తాగునీరు అందజేస్తున్న సర్పంచ్ రామారావు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామ పంచాయతీలోని పలు వీధుల ప్రజలకు సర్పంచ్ బోసి రామారావు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించారు. గురువారం గ్రామంలోని రెడ్డిక, జాలరి, మజ్జి వీధుల ప్రజలకు తాగునీరు సరఫరా చేసే వాటర్ పాయింట్‌కు సంబంధించి విద్యుత్ లోవోల్టేజీ సమస్య ఉన్నందున తాగునీరు సరఫరాకు అంతరాయం కలిగిందని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని ప్రతీరోజు అందిస్తామని సర్పంచ్ తెలిపారు.

గణితంలో పట్టు సాధించాలి



గణిత పోటీలను నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి అనురాధ

మెళియాపుట్టి: వేసవిలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి అనురాధ అన్నారు. విద్యార్థులకు గణితంలో వారి ప్రతిభను వెలికితీయడానికి క్విజ్ పోటీలను గురువారం నిర్వహించారు. గణితం సబ్జెక్ట్ అతి ముఖ్యమైందన్నారు. విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా అనేక పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. నీతికథలు, జనరల్ నాలెడ్జ్, ప్రముఖుల జీవిత చరిత్రలు, ప్రపంచ వింతలు తెలిపే పుస్తకాలు ఉన్నాయన్నారు. ప్రతీ విద్యార్థి వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రమాదకరంగా కర్లెమ్మ వంతెన

కొత్తూరు: మండలంలోని అలికాం బత్తిలి రోడ్డులో గల కర్లెమ్మ వంద హద్దు బంగి గెడ్డపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. సుమారు 200 ఏళ్ల కిందట నిర్మించిన ఈ వంతెన శిథిలావవస్థకు చేరుకొంది. కొత్తూరు నుంచి ఒడిశాకు ప్రతి నిత్యం వందలాది వాహనాలు ఈ వంతెన పైనుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో వంతెన మరింత ప్రమాదకరంగా ఉంది. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పడిపోయాయి. పచ్చిమొక్కలతో నిండిపోవడంతో వంతెన కొంత భాగం కనిపించడం లేదు. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో మరింత ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి పాత వంతెన స్థానంలో కొంత వంతెన నిర్మించాలని స్థానికులు, ప్రయాణీకులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరకున్న వంతెన